క్లుప్తంగా

నేడు చెక్కుల పంపిణీ

బెజ్జూర్: మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన 57 కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు పంపిణీ చేయనున్నట్లు బీజేపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో జరిగే కార్యక్రమానికి లబ్ధిదారులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రెవెన్యూ స్టాంప్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేక పూజలు చేస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: భక్తిశ్రద్ధలతో శుక్రవారం మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేదపండితులు కిషోర్ శర్మ ఆధ్వర్యంలో శివ గణపతి నందికేశ్వర అభయాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు హోమం, పూర్ణాహుతి వివిధ రకాల పూజలు చేశారు.

సీసీరోడ్లపై విచారణ



సీసీరోడ్డు కొలతలు తీస్తున్న అధికారులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల పేరిట గత సర్పంచ్ తీవ్ర అవినీతికి పాల్పడ్డాడని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీసీ రోడ్డును శుక్రవారం పంచాయతీ రాజ్ డీఈ రామ్మోహన్, ఏఈ ఆత్మారాంలు పరిశీలించారు. సీసీ రోడ్డుకు కొలతలు తీసి వివరాలు సేకరించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

వీఈఆర్ రిజిస్టర్ నమోదు చేయాలి

కెరమెరి: విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ (వీఈఆర్)ను నమోదు చేయాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని భీమన్‌గోంది ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో దత్తారావు

బెజ్జూర్: ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా డీఆర్‌డీవో దత్తారావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం 2023–24కు సంబంధించిన రూ.5 కోట్ల పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధిహామీ పథకంలో 298 పనుల్లో 24 అంశాలపై 42 మంది సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రూ. 69వేల నిధులు రికవరీ, సిబ్బందికి రూ.12వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, ఎంపీడీవో గౌరీశంకర్, ఎస్ఆర్పీ తిరుపతి, డీఆర్పీ అశోక్, ఏపీవో రజనీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యకళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలకు స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని శుక్రవారం పట్టణంలోని పద్మశాలి భవనంలో నిర్వహించిన పద్మశాలి జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. జిల్లా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అదేవిధంగా ఆసిఫాబాద్ పట్టణ ప్రధాన కూడలిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, గౌరవ అధ్యక్షుడు సామల రాజయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

మంచం పట్టిన తిర్యాణి



పై చిత్రంలో కనిపిస్తున్న పిల్లలు గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. మండలంలోని చింతలపెల్లి గ్రామానికి చెందిన మడావి మంజుల–నాగేశ్వర్ దంపతుల కుమారులు వీరు. దగ్గరలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకొని ఇంటి దగ్గరే మందులు వాడుతున్నారు. కాగా రెండు రోజుల క్రితం వీరి నుంచి తల్లిదండ్రులకు సైతం జ్వరం సోకింది. దీంతో ప్రస్తుతం ఇంటిల్లిపాది జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. ఇలా మండల వ్యాప్తంగా దాదాపు ప్రతీ ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాల బారిన పడ్డారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- ఒకే ఇంట్లో ఇద్దరు నుంచి ముగ్గురికి జ్వరాలు
- గ్రామాల్లో కానరాని ఫాగింగ్
- ప్రభుత్వాసుపత్రిలో వైద్యసిబ్బంది కరువు
- ప్రైవేట్ వైద్యమే దిక్కు

తిర్యాణి: ఏజెన్సీ మండలం తిర్యాణిలో జ్వరాలతో ప్రజలు వణికిపోతున్నారు. మండలంలో 29 గ్రామ పంచాయతీల్లోని దాదాపు అన్ని గ్రామాల్లో వారం రోజుల నుంచి జ్వర పీడితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మండలంలో మూడు పీహెచ్‌సీలతో పాటు 30 పడకల ఆసుపత్రి ఉంది. కాగా అందులో సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో ఆదివాసీలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది.

ప్రతీ ఇంట్లో జ్వరాలు..

మండలంలోని మొర్రిగూడ, తిర్యాణి, ఎదులపహాడ్, చింతపెల్లి, గంభీరావుపేట, కొత్తగూడ, కొలంగూడ, గుండాల తదితర గ్రామాలల్లో ఇంటికి ఇద్దరు, ముగ్గురు జ్వర పీడితులు ఉన్నారు. మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిలో రోజుకు 60 నుంచి 100 వరకు ఓపీ నమోదవుతుండగా, అందులో సగానికిపైగా జ్వరంతో బాధపడుతున్న వారు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రికి సుస్తి..

తిర్యాణి మండలంలోని ప్రభుత్వాసుపత్రిలో తగిన సౌకర్యాలు, సిబ్బంది లేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో జ్వరాలతో బాధపడుతూ ఇక్కడికి వచ్చే వారి సంఖ్య 50శాతం కూడా ఉండడం లేదు. మండల కేంద్రంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కలిసి ఉన్న 30 పడకల ఆసుపత్రిలో ఆరుగురు వైద్యులు ఉండాలి. కానీ ప్రస్తుతం ఒకే ఒక్క వైద్యుడు సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో కేవలం మలేరియా కిట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధుల నిర్ధారణ కోసం జిల్లా కేంద్రంలోని టీ-హబ్‌కి పంపిస్తుండటం, వాటికి సంబంధించిన రిపోర్టులు వారం రోజులు గడిచినా రాకపోవడంతో రోగులు ఆర్ఎంపీల వద్దకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. కాగా ఇదే అదునుగా కొంతమంది ఆర్ఎంపీలు తమకు వచ్చిన వైద్యం చేస్తూ అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కానరాని ఫాగింగ్..

స్వచ్ఛదనం -పచ్చదనం పేరిట ప్రభుత్వం వివిధ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పంచాయతీల్లో నిధులు లేక అధికారులు తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహించారు. వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ (దోమల మందు పిచికారీ) చేపట్టాల్సి ఉన్నా నేటికి చాలా వరకు గ్రామాల్లో చేపట్టలేదు. పలు గ్రామపంచాయతీలకు చెందిన ఫాగింగ్ యంత్రాలు మూలనపడ్డాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది గ్రామాల్లో వందలాది మంది సీజనల్ వ్యాధుల బారినపడుతున్నారు. మండలంలోని ప్రతీ ఊరిలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, గ్రామాల్లో వైద్యశిబిరాలు కూడా ఏర్పాటు చేయడం లేదని మండలవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి వైద్యుడు రామకృష్ణను వివరణ కోరగా ఓపీలో సగం వరకు జ్వరాలకు సంబంధించిన కేసులే వస్తున్నాయన్నారు. సరిపడా వైద్యులు లేకపోవడంతో వైద్యశిబిరాలు నిర్వహించలేకపోతున్నామని, ఆసుపత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

మూడు రోజులుగా జ్వరం



నాకు గత మూడు రోజులుగా జ్వరం వస్తుండటంతో రెండు రోజుల క్రితం రోగ నిర్ధారణ కోసం రక్తనమునాలు సేకరించి ఆసిఫాబాద్‌లోని టీ–హబ్ సెంటర్‌కు పంపించారు. రిపోర్టులు ఇంకా రాకపోవడంతో ప్రతీ రోజు ఆసుపత్రికి వచ్చి ఇంజెక్షన్ తీసుకొని వెళ్తున్నా. రిపోర్టులు త్వరగా వస్తే అందుకు అవసరమైన చికిత్స తీసుకోవచ్చు.

– మేన రాజు, తిర్యాణి

ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తున్నాం..



మా ఇంట్లో నా పిల్లలు, భార్యకు వారం రోజులుగా జ్వరం వస్తోంది. సర్కారు ఆసుపత్రిలో రిపోర్టులు త్వరగా రావని ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించి ఆర్ఎంపీ దగ్గర చికిత్స అందిస్తున్న. ముగ్గురికి కలిపి ఇప్పటికే రూ.20 వేలకు పైగా ఖర్చయ్యింది. గ్రామంలో డ్రెయినేజీలు లేక, రోడ్లపైనే నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కోట్నాక దౌలత్‌రావు, కొత్తగూడ

జ్వరాలు తగ్గాలని పూజలు



గెర్రెలో జలాభిషేకం చేస్తున్న మహిళలు

దహెగాం: మండలంలోని గెర్రె గ్రామంలో జ్వరాలు తగ్గాలని శుక్రవారం గ్రామ మహిళలు గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. గ్రామంలో ఊరు పోచమ్మ తల్లికి, కన్నెపల్లి పోచమ్మ, ఆంజనేయ స్వామికి జలాభిషేకం చేశారు. గ్రామంలో జ్వరాల బారిన పడకుండా ఉండాలని, వచ్చిన వారికి త్వరగా తగ్గాలని దేవతామూర్తులను వేడుకున్నట్లు మహిళలు పేర్కొన్నారు. జ్వరాలు రావడం వల్ల మోకాళ్ల నొప్పులు అధికమవుతున్నాయని వాపోయారు.

నేడు శనిమందిర్‌లో ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని పోచమ్మబస్తీలో గల శ్రీ శనేశ్వర ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పండితులు నంద కిశోర్ శర్మ తెలిపారు. శనీశ్వరునికి తైలాభిషకాలు నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు క్యాండిల్ ర్యాలీ

కాగజ్‌నగర్‌రూరల్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా శనివారం పట్టణంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలుపదాసు శ్రీదేవి తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు లారీ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ర్యాలీలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



దహెగాం: పూజలో పాల్గొన్న మహిళలు



కౌటాల: పూజలు చేస్తున్న భక్తులు

దహెగాం: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లలో పూజలు చేశారు. ఆలయాల్లో సైతం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని కంకలమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించారు. ఆలయంలో కంకలమ్మ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రకాశ్ ఆధ్వర్యంలో మహిళలు వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుహల్లో, క్వారీల్లో పులులు..?

కెరమెరి: గడిచిన పది రోజులుగా పులి, చిరుత ఆచూకీ కోసం అటవీ అధికారులు గాలిస్తున్నప్పటికీ జాడ తెలియడం లేదు. గురువారం లక్మాపూర్ అడవుల్లోని వ్యవసాయ పొలంలో చిరుత పాదముద్రలు ఉన్నట్లు గుర్తించిన రైతులు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు అడవులను జల్లెడ పడుతున్నారు. కానీ పులికి సంబంధించి ఎలాంటి జాడ తెలియడంలేదు. కాగా అధికారులు శుక్రవారం రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఒక బృందం ఎసాపూర్, ఇంద్రాగనర్ అడవుల్లో, మరో బృందం కోటా పరంధోళి, లక్మాపూర్ అడవుల్లో గాలించారు. పులి గుహ లేదా క్వారీల్లో తలదాచుకుంటున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పులి జాడ కోసం నాలుగు కెమెరాలు ఏర్పాటు చేసినా ఒక్క కెమెరాకు కూడా చిక్కడం లేదు. కాగా కొన్ని ప్రాంతాల్లో చిన్నవి, మరికొన్ని ప్రాంతాల్లో పెద్ద పాదముద్రలు కనిపిస్తుండడంతో చిరుతతో పాటు పులి కూడా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అటవీ అధికారులు సాగరిక, వందన, నజీర్‌అలి, విజయ్ ప్రకాశ్, రామయ్య తదితరులు ఉన్నారు.



గాలింపు చర్యలు చేపడుతున్న అటవీ అధికారులు

అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడవాలి

జైనూర్: సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే అడుగుజాడల్లో యువత నడవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో అన్నాభావు సాఠే జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అన్నాభావు సాఠే విగ్రహ నిర్మాణానికి స్థలంతో పాటు కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించడానికి కృషి చేస్తామన్నారు. మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మోహళే దత్తా, లాడ్జిస్ వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ముండే, సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, హెచ్ఆర్‌సీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, దళిత సంఘాల నాయకులు కాంబ్లే అన్నారావు, అశోక్, బాబాసాహెబ్, సతీశ్ తదితరులు ఉన్నారు.



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కోవ లక్ష్మి

'మహిళలను అగౌరవపరిస్తే ఊరుకోం'

రెబ్బెన: రాష్ట్రంలోని మహిళలను అగౌరవ పరిస్తే చూస్తూ ఊరుకోబోమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు హెచ్చరించారు. ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల అధ్యక్షుడు రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మాజీ జెడ్పీటీసీ సంతోష్, సుదర్శన్‌గౌడ్, సోమశేఖర్, రాజేంద్ర కుమారి, మురళీ, నాయకులు రవీందర్, పల్లాస్, కిషన్‌గౌడ్, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

కెరమెరి: 'మహిళలు బ్రేక్ డ్యాన్స్ చేయండి' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై దహనం చేశారు. మండలాధ్యక్షుడు ఆత్రం కుసంబ్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, రాథోడ్ శంకర్‌నాయక్, శేశారావు, జల్పత్‌రావు, వెంకట్‌స్వామి, శ్రీనివాస్, నాగు, నగేశ్, బాబు, గిడ్డప్ప, సుదర్శన్, తిరుపతి, బాపురావు, హన్మంతు ఉన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బంద్ ప్రశాంతం

దహెగాం: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో విశ్వహిందు పరిషత్ పిలుపు మేరకు మండల కేంద్రంలో శుక్రవారం వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపార సముదాయాలు మూసి ఉంచారు.

కౌటాల: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ప్రకటించిన బంద్ కౌటాలలో శుక్రవారం విజయవంతమైంది. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా కౌటాల హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక కుమురం భీం చౌరస్తా నుంచి ముత్తంపేట్ వరకు బైక్ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో హిందూ ఐక్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.

నేడు పెంచికల్‌పేట్ బంద్

పెంచికల్‌పేట్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛందంగా బంద్ పాటించాలని హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. విద్యాసంస్థలు, హోటల్స్, వ్యాపార సముదాయాలు మూసివేసి వ్యాపారులు బంద్‌కు సహకరించాలని కోరారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల కమిటీలు ఎన్నిక



ఎన్నికైన సభ్యులతో జిల్లా నాయకులు

కెరమెరి: జిల్లాలోని లింగాపూర్, సిర్పూర్(యూ) మండలకేంద్రాల్లో ఆయా మండలాల సమగ్రశిక్ష ఉద్యోగుల కమిటీలను జిల్లా నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం, జిల్లా జేఏసీ ప్రతినిధి దేవేందర్ మాట్లాడుతూ హక్కుల సాధన, ఉద్యోగ భద్రత కోసం ప్రతి ఒక్క ఉద్యోగి ఉద్యమంలో పాల్గొనాలన్నారు. అనంతరం లింగాపూర్, సిర్పూర్ (యూ) మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగుల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లింగాపూర్ మండల అధ్యక్షులుగా శైలజ(సీఆర్‌టీ), గౌరవఅధ్యక్షులుగా సరస్వతి(ఎస్‌వో), ఉపాధ్యక్షులుగా సుమన్‌బాయి (ఐఆర్‌పీ), ప్రధాన కార్యదర్శిగా సంజీవ్(సీఆర్‌పీ), సిర్పూర్(యూ) మండల కమిటీ అధ్యక్షులుగా కల (సీఆర్‌టీ), గౌరవ అధ్యక్షులుగా స్వప్న(ఎస్‌వో), ఉపాధ్యక్షులుగా మీరాబాయి(నాన్‌టీచింగ్), ప్రధాన కార్యదర్శిగా సంతోష్(ఎంఐఎస్ కోర్డినేటర్) తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మహేశ్, రమేశ్, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల సమగ్రశిక్ష ఉద్యోగులు, ఎస్‌వోలు ఉన్నారు.

పీవోకు సన్మానం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీకి ప్రాజెక్టు అధికారిగా ఇటీవల బదిలీపై వచ్చిన నరేందర్‌ను శుక్రవారం ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీవోను శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. ఏరియా కార్యదర్శులు సంజీవ రెడ్డి, మాదవకృష్ణ, వెంకటేష, ఫిట్ కార్యదర్శి భాస్కరాచారి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి ప్రభాకర్, ఏరియా నాయకులు రాజేశం, శ్రీనివాస్, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు బొడ్డు శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం ఉద్యమకారుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. తెలంగాణ ఉద్యమంలో బొడ్డు శంకర్ చేపట్టిన ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, మాజీ ఎంపీపీ సౌందర్య, శ్రీనివాస్, అహల్యాదేవి, శ్రీధర్, అన్నపూర్ణ అరుణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి..

మండల కేంద్రానికి చెందిన జోహాప్రైరీ అనే చిన్నారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి చిన్నారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు.

'బాధితులకు అండగా ఉంటాం'

కౌటాల: జ్వరంతో మృతి చెందిన పూజ, కాళీదాస్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని గుండాయిపేట గ్రామంలో బాధిత కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని హెల్త్ సబ్‌సెంటర్‌లో వైద్యులు లేరని, పారిశుధ్యం సక్రమంగా లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని, మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు నరులే వానుపటేల్, నాయకులు దుర్గం యశ్వంత్, మిథున్, విజయ్, చందు, తిరుపతి, నానాజీ, మోరేశ్వర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్సీ బాలికల వసతిగృహం మంజూరు చేయాలి

వాంకిడి: మండల కేంద్రంలోని పాత బాలికల వసతి గృహ భవనాన్ని పునరుద్ధరించి తిరిగి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన వసతి గృహ భవనాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థినులు దూర ప్రాంతాల నుంచి రావడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదేళ్ల క్రితం మూతపడిన వసతిగృహ భవనానికి మరమ్మతులు చేయించి కళాశాల విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి వచ్చేలా కృషి చేయాలని కోరారు. వసతి గృహం అందుబాటులోకి వస్తే ప్రభుత్వ కళాశాలల్లో చదివే దూర ప్రాంతాల్లోని బాలికలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

రెబ్బెన: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని హర్షిస్తూ శుక్రవారం మండలంలోని గంగాపూర్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపెల్లి ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 30 ఏళ్ల పాటు చేపట్టిన సుదీర్ఘ పోరాటం మూలంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ వర్గీకరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు ఇగురపు సంజీవ్, రవి, అరికిల్ల వెంకటేష్, శ్రీనివాస్, రాజయ్య, భూమయ్య, బాపు, ఆశయ్య, పోచయ్య పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే విమర్శలు చేయడం తగదు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, అభివృద్ధి పనుల పేరిట జరిగిన అవినీతిపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నిస్తే మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సమంజసం కాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదన్నారు. నాయకులు మాజీ ఎంపీటీసీ మంగిలాల్, అస్లాం, ఫహాద్ అహ్మద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిన అతిథి అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని, సర్వీస్ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రాజధానిలోని ఇంటర్మీడియెట్ బోర్డు ఎదుట నిర్వహించిన ధర్నాకు జిల్లాలోని అతిథి అధ్యాపకులు తరలివెళ్లారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కృష్ణమూర్తి, మారుతి, సత్యం, సరళ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్ జయంతి ఘనంగా జరపాలి

బెజ్జూర్: బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ జయంతిని ఊరువాడలో ఘనంగా జరపాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు కొంద్ర మనోహర్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 18న ప్రతీ గ్రామం, మండల, జిల్లా కేంద్రాల్లో ఘనంగా జరపాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : ఉమేష్‌కుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899